క్లుప్తంగా

నగర కమిషనర్‌గా జగన్నాథ్



కమలాపురం : నగర పంచాయతీ కమిషనర్‌గా పగడాల జగన్నాథ్ శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందజేసి ఆహ్వానించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణం పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజ్ తదితర అభివృద్ధి పనులన్నీ ఎమ్మెల్యే సహకారంతో పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎన్నికలకు ముందు ఈయన ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషన్‌గా సేవలు అందించారు.

వెల్లటూరు సర్పంచ్‌గా నాగార్జునరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగార్జునరెడ్డి

పెండ్లిమర్రి : వెల్లటూరు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా తిప్పలూరు నాగార్జునరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత సర్పంచ్ మస్తాన్‌బీ అనారోగ్య కారణంగా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. జిల్లా పంచాయతీ అధికారులు ఆదేశాలమేరకు ఉపసర్పంచ్‌గా నాగార్జునరెడ్డికి సర్పంచ్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ తన బాధ్యతలను సక్రమంగా నేరవేర్చి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, పి.రవీంద్రనాథ్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఏఓగా సురేంద్రనాథ్

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి ఎంపీడీవో కార్యాలయం ఏఓగా సురేంద్రనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పెండ్లిమర్రిలో ఏఓగా పని చేస్తున్న అల్తాఫ్‌హుస్సేన్ ముద్దనూరుకు బదిలీపై వెళ్లారు. పులివెందుల ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న సురేంద్రనాథ్ ఇటీవల జరిగిన బదిలీలల్లో పెండ్లిమర్రికి వచ్చారు.

నేడు గండిలో కొబ్బరికాయల టెండర్లు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో యేడాది కాలం కొబ్బరి కాయలు విక్రయించుకునే హక్కు కల్పించుటకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. టెండరులో పాల్గొను వారు రూ.10 లక్షలు ధరావత్తు బ్యాంకు డీడీ, చెక్కు లేదా నగదు చెల్లించాలన్నారు. టెండరులో హిందువులు మాత్రమే పాల్గొనాలన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వాహనాల తనిఖీ

కమలాపురం : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను, లైసెన్స్, ఆర్‌సీ లేకుండా వాహనాలు నడిపే వారిని పట్టుకుని జరిమాన విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్‌లు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే లైసెన్స్ లేకుండా, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ, ట్రిపుల్ రైడింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్లు నడిపే వారు తప్పని సరిగా సీట్ బెల్ట్ ధరించాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మురళీకృష్ణ సేవలు మరువలేనివి

రూరల్ : పట్టణంలోని స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఏఈ మురళీకృష్ణ బదిలీ సందర్భంగా ఆయనను సన్మానించారు. రూరల్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో మురళీకృష్ణ ఎంతో కృషి చేశారన్నారు. అనంతపురం జిల్లాకు టెక్నికల్ సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఆయన బదిలీపై వెళ్లనున్నారన్నారు. కార్యక్రమంలో ఏఈలు జగదీశ్వరరెడ్డి, రమేష్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

12వ పీఆర్సీ అమలులో జాప్యమెందుకు

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ అమలులో జాప్యమెందుకు అని ఏస్టీయూ ఏపీ కడప జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక ఎస్టీయూ ఏపీ కార్యాలయంలో రీజియన్ కన్వీనర్ వి.ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ ఉపాధ్యాయుల ఆశలకనుగుణంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన దాటిందని, అయితే ఉపాధ్యాయుల ఆర్థిక, ఇతర సమస్యల పరిష్కారానికి చొరవ చూపలేదన్నారు. దీంతో ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణారెడ్డి, బాలగంగారెడ్డిలు మాట్లాడుతూ 12వ పీఆర్సీ 2023 జులై నుంచి అమలు చేయాల్సి ఉండగా.. జాప్యం కారణంగా 30 శాతం ఐఆర్‌ను ప్రభుత్వం తక్షణమే ప్రకటించాల ని డిమాండ్ చేశారు. అలాగే కొత్త పీఆర్సీ అమల్లోకి వచ్చే వరకు 30 శాతం మధ్యంతర భృతిని కూడా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ జూదం.. యువత ప్రాణాలతో చెలగాటం

- పెడదోవపడుతున్న యువత
- అప్పులపాలై ఆస్తులు అమ్ముకుంటున్న వైనం
- ఎర్రగుంట్లలో వ్యసనానికి బానిసవుతున్న యువకులు



ఆన్‌లైన్‌లోని గేమ్‌లు



ఎర్రగుంట్ల : పల్లె, పట్టణాలలో విద్యార్థులు ఆన్‌లైన్ జూద వలలో చిక్కుకుని భారీగా నష్టపోతున్నారు. రెట్టింపు డబ్బు వస్తుందనే ఆశతో అధిక మొత్తంలో జమ చేస్తుంటారు. 15 శాతం కమీషన్ రూపంలో ఆన్‌లైన్ కంపెనీలు లాగేసుకుంటాయి. స్థానికంగా పలు ప్రాంతాల్లో వెలుగుచూస్తున్న కొన్ని సంఘటనలే దీనికి నిదర్శనం.

జీవితాలను తలకిందలు చేస్తున్న జూదం..

ఆన్‌లైన్ బెట్టింగ్ ఎందరో జీవితాలను తలకిందలు చేస్తున్న ఓ జూదక్రీడ. సామాన్య, మధ్య తరగతి వర్గాల నుంచి ధనవంతుల వరకు, యువత నుంచి మధ్య వయసు వరకు ఎందరో దీని బాధితులే. సులభంగా డబ్బులు సంపాదించొచ్చని, అదృష్టం వరిస్తే.. లక్షాధికారులు కావొచ్చని.. చిన్న మొత్తం వెచ్చించి.. పెద్ద మొత్తంలో డబ్బు సమకూరితే కష్టాలు తొలగిపోతాయని భావిస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దిగుతున్నారు. క్రమంగా ఇదో వ్యసనంగా మారిపోయి ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. తీర్చలేనంత అప్పు చేసి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

వ్యసనంగా మారి.. నష్టాలు చవిచూసి

ప్రస్తుత పరిస్థితుల్లో స్మార్ట్ ఫోన్‌లేని వ్యక్తి అంటూ ఎవరూ ఉండరు. నెట్ సేవలు సులభంగా అందుబాటులోకి రావడంతో ఆన్‌లైన్‌లో ఆటలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. వందలతో మొదలై వేలు, లక్షలు చేతులు మారిపోతున్నాయి. ఫోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుని తరిగి చెల్లించలేనివారి బంధువులు, మిత్రులకు అసభ్యంగా ఉండే చిత్రాలను మార్ఫింగ్ చేసి పంపుతున్నారు. పరువు కాపాడుకునేందుకు అప్పులు చేసి రుణాలు చెల్లిస్తున్నారు.

సులభంగా సంపాధించాలని..

సులభంగా డబ్బు సంపాధించాలనే ఆశతో కొందరు యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీలోడో, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌లు చేస్తున్నారు. మొదట సరదాగా మొదలు పెట్టి వాళ్లు చివరకు అప్పులు ఊబిలో కూరుకుపోతున్నారు. దీనికి తోడు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు చాలానే ఉన్నాయి. వీటిపై వల పన్నినా సైబర్ నేరగాళ్లు ఖాతాలను యాక్ చేసి డబ్బంతా లాగేస్తున్నారు. ఇలానే ఎర్రగుంట్ల పట్టణంలో గతంలో చాలా జరిగాయి. ఓ బిటెక్ చదివిని అమ్మాయికి ఉద్యోగం ఆశ చూపి ఆన్‌లైన్‌లో ఆ అమ్మాయి డబ్బులును లాగేసుకున్నారు. అలాగే మరో ఇద్దరు యువకులు ఇదే మోసంలో పడి డబ్బులు పొగుకుట్టకున్నారు.

పిల్లలపై నిఘా ఉంచాలి..



పిల్లల నడవడికపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి. వారికి అనవసరంగా డబ్బు, సెల్ ఫోన్‌లు ఇవ్వడం మంచిది కాదు. ఆన్‌లైన్‌లో వివిధ రకాల మోస పూరిత గేమ్‌లు ఉంటాయి. ఆ గేమ్‌లకు అలవాటు పడి బెట్టింగ్‌లపై దృష్టి సారిస్తున్నారు. సరదాగా జూదం అంటూ ఆ తర్వాత వ్యసనంగా మార్చుకుంటున్నారు. అలాంటి వారిని గుర్తించి తమకు అప్పగిస్తే కౌన్సిలింగ్ ద్వారా మార్పు తీసుకొస్తాం. సాంకేతిక పరిజ్ఞానంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ జూదగాళ్ల ఆట కట్టించేలా చర్యలు చేపడుతున్నాం.

– నరేష్‌బాబు ,అర్బన్ సీఐ ఎర్రగుంట్ల

యువత జీవన శైలి అందరికీ ఆదర్శంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ లోకేశ్వరరావు

లింగాల : యువత జీవనశైలి మత్తు బారిన కాకుండా అందరికీ ఆదర్శంగా ఉండాలని లింగాల ఎంపీడీఓ లోకేశ్వర్‌రావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మాదక ద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత అనే అంశంపై ఆయన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థిదశలో సరదాల కోసం మత్తు పానీయలకు అలవాటు కాకుండా యువత విద్యార్థి దశ నుండే తన జీవన శైలి అందరికి ఆదర్శంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు వచ్చేలా, గురువులకు గౌరవం పెంచేలా ఉండాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలన ప్లకార్డులను వారు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని పోలీసుశాఖ, నెహ్రు యువ కేంద్రం, స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీరామ్, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ శివరాం, సేవా సమితి అధ్యక్షుడు రాజు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు నోటీసులు జారీ



వైఎస్సార్ సీపీ మైనార్టీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్‌కు నోటీసులు ఇస్తున్న పోలీసులు

కమలాపురం : మండలంలోని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం తిరుమల వెళ్లనున్న నేపథ్యంలో స్థానిక నాయకులెవరూ తిరమలకు వెళ్లవద్దని పోలీసులు నోటీసులు జారీ చేశారు. తిరుమల లడ్డు ప్రసాదం తయారీ వివాదం ఉన్న సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి దర్శనం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. కాలినడకలో భక్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎక్కువైతే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తిరుపతిలో 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉందని, ఎలాంటి ర్యాలీలు, సభలు, పాదయాత్రలు నిర్వహించరాదని పోలీసులు తెలిపారు. తిరుమలకు వెళ్లడానికి వైఎస్సార్ సీపీ నాయకులకు ఎలాంటి అనుమతులు లేవని, ఇళ్లు వదిలి ఎవరూ బయటకు రావద్దని, అలా వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్థానిక నాయకులకు నోటీసులు ఇస్తూ హెచ్చరికలు జారీ చేశారు.

తెగిన కాజ్ వే.. ఆగిపోయిన రాకపోకలు



కోతకు గురైన కాజ్‌వేను చూపిస్తున్న రైతులు

కమలాపురం : మండలంలోని గంగవరం–చాపాడు మండలం రంగనాయకుల తువ్వ గ్రామాలకు వారధిగా పెన్నానదిపై ఉన్న కాజ్‌వే తెగిపోయింది. గురువారం మైలవరం నీళ్లు వదలడంతో నీటి ఉధృతి ఎక్కువ కావడంతో కాజ్ వే కోతకు గురైంది. దీంతో ఇరు మండలాలకు చెందిన ప్రజలు, రైతులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కమలాపురం మండలం గంగవరం, విభరాపురం తదితర గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించిన భూములు కాజ్ వే అటు వైపు ఉన్న రంగనాయకుల తువ్వలో ఉన్నాయి. దీంతో రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే తప్పని సరిగా కాజ్‌వే దాటి వెళ్లాల్సిందే.

మైలవరం నీళ్లు ఎక్కువగా వచ్చిన ప్రతిసారి ఈ కాజ్‌వే కోతకు గురవుతోందని, ఆ సమయాల్లో తాము పొలాలకు వెళ్లలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కమలాపురం మండలం నుంచి వెదురూరు, రాజుపాళెం, రంగనాయకుల తువ్వ, చాపాడు తదితర గ్రామాలకు వెళ్లాలంటే ఈ కాజ్ వే దాటుకుని వెళ్లాల్సిందే. ఇలా కాజ్‌వే దెబ్బ తిన్నప్పుడు ఆయా గ్రామాలకు వెళ్లాలంటే కనీసం 20 కి.మీ. దూరం ప్రయాణించాల్సి వస్తుందని వారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ కాజ్‌వే స్థానంలో హై లెవెల్ వంతెన నిర్మించాలని రైతులు, ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.

పాప ప్రక్షాళన కోసం పూజలు చేయండి

కమలాపురం : ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు తిరుమల లడ్డూను, వెంకటేశ్వరస్వామి విశిష్టతను అపవిత్రం చేశారని, ఆ పాప ప్రక్షాళన కోసం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూజలు చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సీకేదిన్నె మండలంలోని ప్రాశస్త్యం కలిగిన రామాలయంలో శనివారం తాను పూజలు చేస్తున్నానని ఆయన తెలిపారు. చంద్రబాబు చేసిన పాపానికి తామంతా ప్రాయశ్చిత్తంగా అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో ప్రజలు, భక్తులు పూజలు చేయాలని ఆయన కోరారు.

ఎర్రగుంట్ల..

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం 8.30 నిమిషాలకు సీఎం చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు పాప ప్రక్షాళన పూజ నిర్వహిస్తున్నట్లు జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి చంద్రబాబు తిరుమల తిరుపతి లడ్డూను, వేంకటేశ్వర స్వామి విశిష్టతను అపవిత్రం చేశారన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు పాల్గొనాలన్నారు.

ప్రత్యేక పూజలలో వైఎస్సార్‌సీపీ శ్రేణులందరూ పాల్గొనాలి

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ప్రత్యేక పూజలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వైఎస్సార్ సీపీ మహిళా సంఘాలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులందరూ పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ పార్టీ వర్గాలు తెలిపారు. శుక్రవారం వారు తెలుపుతూ సీఎం చంద్రబాబు తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని అప్రతిష్టపాలు చేసి హిందూ మనోభావాలను దెబ్బతీసే విధంగా అసత్య ప్రచారాలు చేస్తూ, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద, వైఎస్సార్‌సీపీ మీద, కుల, మతాల మధ్య చిచ్చు రేపుతున్నారన్నారు. తిరుమల వెంకటేశ్వరస్వామి వారి పవిత్రతకు భంగం కలగకుండా రాష్ట్రానికి మంచి చేకూరాలని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పాల్గొంటారని.. ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంప్రదాయ దుస్తులతో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన నడుస్తోంది

వేంపల్లె : రాష్ట్రంలో రాజ్యాంగం ప్రకారం పరిపాలన సాగట్లేదని కక్ష పూరిత పరిపాలన సాగిస్తున్నారని, రెడ్ బుక్ పాలన నడుస్తోందని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ రంతుల్లాఖాన్ విమర్శించారు. చంద్రబాబు తన సీనియార్టీ అంతా డైవర్షన్ పాలిటిక్స్‌తోనే నడుపుతున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టనున్న తిరుమల పాదయాత్రకు ఎవ్వరూ వెళ్లొద్దని పోలీసులు వైసీపీ వారికి నోటీసులు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను, వాగ్దానాలు నేరవేర్చకుండా కప్పిపుచ్చుకుంటూ పాలన సాగిస్తున్నందుకు చంద్రబాబుకు సెల్యూట్ చేయాల్సిందేనన్నారు.

రాష్ట్ర ఉపముఖ్య మంత్రి హోదాలో పవన్ కళ్యాణ్ దీక్షలంటూ, సనాతన ధర్మమంటూ మత కలహాలు రెచ్చగొట్టేవిధంగా మాట్లాడటం బాధాకరమన్నారు. చంద్రబాబు నాయకులపై, ప్రజలపై పోలీసులకు ఒత్తిడి పెట్టి ఇబ్బంది పెట్టడం తప్పా జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజల నుంచి వేరు చేయలేరన్నారు.

పంచాయతీరాజ్ ఈఈగా శ్యాంసుందర్‌రావు



ఈఈ శ్యాంసుందర్‌రావును ఆహ్వానిస్తున్న ఉద్యోగులు

పులివెందుల రూరల్ : పులివెందుల పంచాయతీరాజ్ శాఖ ఈఈగా శ్యాంసుందర్‌రావు శుక్రవారం పంచాయతీరాజ్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన జమ్మలమడుగులో ఈఈగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల ప్రాంతంలో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. డీఈ సుధాకర్‌రెడి, ఏఈలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఈ ఓబుల్‌రెడ్డి పదోన్నతిపై నంద్యాలకు వెళ్లారు.

నైపుణ్య కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల రూరల్ : వృత్తి విద్య నైపుణ్య కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర స్థాయి సమగ్ర శిక్షణ అధికారి రావూఫ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని న్యాక్ ట్రైనింగ్ సెంటర్‌లో న్యాక్ సౌజన్యంతో ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ద్వారా సమగ్ర శిక్ష అభియాన్‌లోని 48 మంది వృత్తి విద్యా శిక్షకులకు (టీఓటీ) శిక్షణ కార్యక్రమాన్ని ఆయనతోపాటు స్టేట్ గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, సమగ్ర శిక్షణ వొకేషనల్ కన్సల్టెంట్ శ్రీనివాసులు పర్యవేక్షించి మాట్లాడారు. ఇక్కడ శిక్షణలో నేర్చున్న ప్రతి విషయం మీరు పనిచేసే స్కూల్‌లో వృత్తి విద్యను విద్యార్థులకు అందించాలన్నారు.

అన్నీ స్కూల్స్‌లో వృత్తి విద్యా నైపుణ్య కేంద్రాలకు కావలసిన సామగ్రిని అందిస్తామని, అలాగే మీరు విద్యార్థులకు వృత్తి విద్యను తప్పని సరిగా సమగ్రంగా నేర్పించాలన్నారు. త్వరలో అందరికి ధృవీకరణ పత్రాలు అందిస్తామని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ తెలిపారు. కార్యక్రమంలో డీసీడీఓ విజయలక్ష్మి, ఒకేషనల్ కోఆర్డినేటర్ మధు మోహన్, నాక్‌సెంటర్ ఇన్‌చార్జి చెన్నకేశవులు, న్యాక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

తొండూరు : బొడివారిపల్లి గ్రామంలో శుక్రవారం మోడల్ మేకర్ నుజహత్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు బీడు భూమిలో ఎలాంటి పంటలు పండించుకోవాలి అనే దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులకు శిక్షణ కల్పించి 1 ఎకరం పొలంలో డ్రాట్ ప్రూఫ్ మోడల్ వినూత్నంగా నిర్వహించామన్నారు. అనంతరం కంది, ఆముదము, అలసంద, అనప, సజ్జ, గోరుచిక్కుడు ఆరు రకాల పంటలు వేయడం జరిగిందన్నారు. వీటికి మొలకశాతం బాగా రావడానికి, తెగులు రాకుండా ఉండటానికి బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం జరిగిందన్నారు. భూమిలో సారవంతం కోసం ఘనజీవామృతం చల్లి విత్తనాలు క్రమంగా వేయించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గురుమోహన్‌రెడ్డి, ఎస్ఎఫ్ఏలు నరసింహారెడ్డి, మేరీ, యూనిట్ ఇన్‌చార్జి ముని భూపాల్, ఫార్మర్ సైంటిస్ట్ రమేష్ రైతులు పాల్గొన్నారు.

మొక్కలను పెంచుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

ఎర్రగుంట్ల : మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవ మనుగడ ఉండదని మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు మొక్కను నాటి పెంచి పోషించాలన్నారు. పాఠశాల ఆవరణలో సుమారు 70 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, ఎంఈఓ శివప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యటనల ద్వారా ప్రకృతితో మమేకం

వేంపల్లె : విద్యార్థులు చదువు, ఆట పోటీలతోపాటు పర్యాటక పర్యటనల ద్వారా ప్రకృతితో మమేకమవుతారని వేంపల్లి శ్రీచైతన్య ఉన్నత పాఠశాల కరెస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో నేచర్ ఎడ్యుకేషన్ క్యాంప్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫారెస్టు రెంజ్ అధికారి బాల సుబ్రమణ్యం ఆదేశాల మేరకు ఇడుపులపాయ అటవీ ప్రాంతాలు, ఏకో, అనిమల్ పార్కులను సందర్శించారు. అనంతరం కరెస్పాండెంట్ మాట్లాడుతూ ఆయా పర్యాటనల ద్వారా ప్రకృతితో మమేకమై ఉన్న పర్యావరణాన్ని ఎలా సంరక్షించుకోవాలో, అడవుల్లోని జీవరాశులపై అవగాహన కలుగుతుందన్నారు. అలాగే ఆర్థికాభివృద్ధిని పెంచడంలో పర్యాటక రంగం ముఖ్యమైన పాత్ర వహిస్తుందన్నారు. పర్యాటక రంగాన్ని ఇంకా అభివృద్ధి చేస్తూ..దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఫారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి డీవీ సుబ్బయ్య, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల దాతృత్వం



షరీఫ్ కుటుంబీకులకు బియ్యం, నగదును అందజేస్తున్న ఉపాధ్యాయులు

చక్రాయపేట : గత నెల 26న గువ్వలచెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కారు డ్రైవర్ షరీఫ్ కుటుంబానికి మండలంలోని కొందరు ఉపాధ్యాయులు రూ.66వేలు నగదు, 5 బస్తాల బియ్యాన్ని శుక్రవారం మండల విద్యాశాఖ అధికారులు జాఫర్ సాదిక్, రవికుమార్‌ల చేతుల మీదుగా అందజేశారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సులు కలిగి ఉండాలి

పులివెందుల రూరల్ : వాహనదారులు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించి లైసెన్స్, రికార్డులు కలిగి ఉండాలని ఎస్ఐ నారాయణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పార్లపల్లి రోడ్డులోని చిన్నరంగాపురం వద్ద వాహనాల తనఖీ చేపట్టారు. రికార్డులు, లైసెన్స్ లేని వారికి జరిమానా విధించారు. ఆటో డ్రైవర్లు అధిక లోడుతో వెళితే తప్పనిసరిగా చట్టపరమైన చర్యలతో పాటు వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు కూడా ముగ్గురు, నలుగురు వెళితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఎర్రగుంట్లలో మురికి నీటిని పరిశీలించి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ శేషఫాణి

కమలాపురం : ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ వసంతబాయి తెలిపారు. శుక్రవారం ప్రాజెక్ట్ కార్యాలయం ఆవరణలో కమలాపురం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ హెల్పర్లు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం వలన వ్యాధులు ప్రబల కుండా ఉంటాయని, తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీఓ తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరయ్య, సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎర్రబల్లెగ్రామంలో శుక్రవారం ఫ్రైడే – డ్రైడే సందర్భంగా ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్త లు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలు సేకరించి వారానికి మూడు సార్లు ల్యా బ్‌కు అందజేయాలన్నారు. ఎంపీహెచ్ఈఓ సతీష్‌కుమార్, ల్యాబ్ టెక్నిషియన్ నరేష్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని కళాశాల అసోసియేట్ డీన్ మాధవ తెలిపారు. శుక్రవారం స్థానిక ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థి వలంటీర్లతో కలిసి ఆయన బాలికల వసతి గృహ పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ వ్యర్థాలు, కలుపు మొక్కలు, ఇతర వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ జయమ్మ, పీడీ డాక్టర్ రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

అలాగే ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతా సీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు.



పులివెందులలో పరిశుభ్రతా కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

కంపోస్ట్ యార్డు తనిఖీ :

కదిరిరోడ్డులో ఉన్న మున్సిపల్ కంపోస్ట్ యార్డును కమిషనర్ తనిఖీ చేశారు. బయట వ్యక్తులెవరూ యార్డులో ఉండకూడదన్నారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని డెంగీ కేసు నమోదైన ప్రకాశ్‌నగర్ కాలనీలో ఆయన పర్యటించి కాలనీ వాసులకు జాగ్రత్తలను తెలిపారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి చుట్టుపక్కల మురికి నీరు నిల్వ ఉంచుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ, మలేరియా జ్వరాలు దోమలు కుట్టడటం వల్ల వస్తాయన్నారు. అలాగే ఇంటి చెత్తను ప్రతి ఒక్కరు మున్సిపల్ వాహనాలలో వేయాలని కమిషనర్ శేషఫణి తెలిపారు. ఏఎంఓ వెంకటరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మయ్య, డాక్టర్లు శ్రీనాథ్‌రెడ్డి, జ్యోత్స్న, ప్రియాంక, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : ప్రతి ఒక్కరిలో సేవా గుణం ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యోగాంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని నందిపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చెత్తాచెదారాన్ని విద్యార్థులు తొలగించి శుభ్రం చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ విభాగం అధికారిణి డాక్టర్ మల్లేశ్వరమ్మ, పాఠశాల హెచ్ఎం చలపతి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటరత్నమ్మ



ముద్దనూరు : స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సబ్‌రిజిస్ట్రార్‌గా వెంకటరత్నమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తు న్న వెంకటరత్నమ్మ సాధారణ బదిలీల్లో భాగంగా ముద్దనూరులో నియమితులయ్యారు.

ఉచిత పశువైద్య శిబిరం

కొండాపురం : మండలంలోని బెడుదూరు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ వారి సౌజన్యంతో జిల్లా పశుఘణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరంను నిర్వహించినట్లు సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ నిర్వహించారు.

సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాడిపశువుల పెంపకంలో పాటించవలసిన మెలకువలను తెలియజేశారు. పాడి రైతులకు సబ్సిడీ పైన 100 కేజీల పశుగ్రాస విత్తనములు సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో కొండాపురం పశువైద్యుడు రాజశేఖర్‌రాజు, ఎల్ఎస్ఏ శ్రీకాంత్ పాల్గొన్నారు.